# ఫిర్యాదు

తిరుపతిలో ఎక్కడ చూసినా క్యూ, క్యూ, క్యూ. గంటల తరబడి నిలబడితేనేగాని పైకి బస్సు దొరకదు. పూటల తరబడి నిలబడితేనేగాని దైవ దర్శనం కాదు.

అలా హడావిడిగా క్యూలలో చాలా కాలం వృధాచేసి కొండదిగి బస్ స్టాండులోకి అడుగుపెట్టాడు వెంకట్రామయ్య. ఆదరాబాదరాగా ఏడు ముప్పావుకి రాత్రి-

ఆసరికి హైద్రాబాద్ వెళ్ళే బస్సు ఒకటోనంబర్ ప్లాట్ ఫారంలో డీలక్స్ లాంజి అద్దాలకిటికీ ముందు వుంటుందని తలచాడు. లేదు ఎనిమిది గంటలకి మైక్ లోంచి చెప్పారు. త్వరలో హైద్రాబాద్ వెళ్ళే ఎనిమిది గంటల బస్సు వస్తుందని.

"ఇక్కడే ఆలస్యం రేపు ఉదయం పదిగంటలకి చేరాలి? ఆఫీసు కెలాగయినా లేటే!" విసుక్కున్నాడు వెంకట్రామయ్య.

"కానండి వెంకన్న ఇంకా మనల్ని వుంచేసుకోవాలని చూస్తున్నాడు" పాతికేళ్ళ పైనుంచి భర్తమనస్తత్వం క్షుణ్ణంగా అర్థంచేసుకున్న వెంకట్రామయ్య భార్య అన్నది.

"ఛ.... ఛ ఇక జన్మలో తిరుపతి రానేరాను పాడు క్యూ" వెంకట్రామయ్య చుట్టవెలిగించి అన్నాడు.

"తప్పు స్వామికి కోపం వస్తుంది" వారించింది వెంకట్రామయ్య సతీమణి

"అయినా ఈ ఆర్టీసి బస్సులు దేనికి! ప్రయాణీకుల సౌకర్యకోసమా? డబ్బు చేసుకునేందుకా? రాత్రి ఎనిమిది గంటలకి రిజర్వ్ చేసుకున్న రెండు సీట్లని మధ్యాహ్నం రెండు గంటలకే బయలుదేరే బస్సుకి మార్చుకోకూడదుట నా బొంద రూల్స్. ఆ బస్ లో రద్దీ లేదు. దీంట్లోనూ రద్దీలేదు. పొరపాటున దీనికి రిజర్వ్ చేశాను. హైద్రాబాద్ కి ఉదయం పదికి లోపల చేరదు నాకు ఆఫీసుకి లేటవుతుంది ఎలాగయినా."

"గంటలేటయింది. కవర్ చేసేసారా దారిలో?" అడిగాడు మళ్ళీ.

నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు కండక్టరు.

"ఏమో ఎంక్వయిరీలో అడగండి"

ఆ కండక్టరు అంతకు మునుపు ఎనిమిది గంటల నుంచి పని చేసి అలసిపోయాడన్న సంగతి వెంకట్రామయ్యకు తెలియదు. తోటి కండక్టర్‌కి సహాయపడటానికి. టికెట్స్ ఇస్తున్నాడన్న సంగతి కూడా తెలియదు.

అతని సమాధానం కోపం తెప్పించింది ఆయనకి. లేచి నిలబడి అడిగాడు గట్టిగా.

"కంప్లంట్ బుక్ ఇవ్వు."

ఇద్దరు కండక్టర్స్ గబగబా చెక్‌చేస్తున్నారు టిక్కెట్స్. బండిని త్వరగా కదల్చాలని. దాన్ని ఆయన నిర్లక్ష్యం క్రింద భావించి. గొంతు పెద్దది చేసి అడిగాడు మళ్ళీ గట్టిగా.

"గంటంపావు లేటయింది ఇప్పటికే. కంప్లయింట్ బుక్ ఇవ్వండి"

"పెరు మారుస్తుంటే ఆలస్యం అయిందిట. పోనివ్వండి" ప్రక్కనున్న కుర్రాడు చెప్పాడు.

ఒకసారి కంప్లయింట్ బుక్‌లో రాస్తేకాని తెలిసిరాదు. లాస్‌అఫ్ పే అవుతుంది తెలుసా?"

"బండి సిద్ధం కాకపోతే మేమేం చేస్తాం?" అన్నాడో కండక్టరు.

"మీరేం చెయ్యనక్కరలేదు. ఆ పుస్తకం ఇవ్వండి చాలు" జేబులోంచి పెన్ను, కళ్ళజోడు తీశాడు వెంకట్రామయ్య.

"ముసలోళ్ళకి చాదస్తం ఎక్కువ" నవ్వుతూ అన్నాడో యువకుడు కండక్టరుతో.

కండక్టర్ అందించిన ఫిర్యాదు పుస్తకంలో బస్సులేటయిన సంగతి రాశాడు వెంకట్రామయ్య. బస్సు దిగి బస్సు రిజిస్ట్రేషన్ నంబరు కూడా

వ్రాశాడు. బస్సు లేటవడంవల్ల తనకి కలిగే ఇబ్బంది కూడా వ్రాసినంతకం పెట్టాడు.

ఆ పుస్తకాన్ని తిరిగి ఇచ్చేసి, కోపంగా కిటికీలోంచి బయటకి చూస్తూ కూర్చున్నాడు.

కండక్టర్ ఆ ఫిర్యాదు చదివి నవ్వుకుని లోపల పెట్టేశాడు పుస్తకాన్ని.

బస్సు బయదేరింది తొమ్మిదీ ఇరవై కి.

బస్సు బయలుదేరాక చెప్పాడు కండక్టరు వెంకట్రామయ్యతో.

"మాదేం తప్పులేదుసార్. టైర్ మార్చడానికి ఆలస్యం ఆయింది, వాళ్ళమీదకే వెళ్తుంది ఈ ఫిర్యాదు."

"టైర్ మార్చి బండిని ఎనిమిదికల్లా సిద్ధంగా వుంచాలి ముందరే."

దారిలో అర్థరాత్రి ఒంటిగంటకి బస్సు టైర్ పంచరయింది. మళ్ళీ టైరు మార్చడానికి అరగంటపైనే పట్టింది.

"ఇంక బస్సు టైంకి చేరినట్లే" అన్నది వెంకట్రామయ్య భార్య.

తెల్లవారాక కర్నూలు చేరింది డిపోలో పెట్రోలు పోయించుకుని స్టాండ్‌కి వచ్చింది ఉదయం ఎదిమిదిన్నరకి.

"పన్నెండు లోపు చేరలేదు. కనీసం నాలుగు గంటలయినా ప్రయాణం, రేపు లాస్ ఆఫ్ పే తప్పదు. బస్ స్టాండ్ నుంచి ఆఫీస్‌కి వెళ్ళినా,

"మీరు తొందరపడి ఎనిమిదిగంటల బస్సుకి రిజర్వ్ చేయకుండా వుండాల్సింది" మందలించింది వెంకట్రామయ్యని ఆయన భార్య.

వెంకట్రామయ్య మౌనంగా వుండిపోయాడు.

"ఇంక తిరుపతి మళ్ళీరానని నాలుగయిదుసార్లు తిరుపతిలో అన్నారు కాబట్టే ఇలా ఆయింది",

"అదే నిజమయినాసరే, చస్తే తిరుపతి మళ్ళీ వెళ్ళను. అంత బెదరించి, బ్లాక్ మెయిల్ చేసే దేముడు నిజంగా వున్నా నాకసలే వద్దు. ఇక ఆయనకి మొక్కుకోను ఏ విషయంలోనూ".

"తప్పు" చెంపలు వేసుకుంది. వెంకట్రామయ్య తరపున తనే క్షమాపణ చెప్పుకుంది ఆవిడ.

* * * *

వారంగడిచాక ఓరోజు వెంట్రామయ్య ఇంట్లోనే వున్నాడు. ఆది వారం కాబట్టి, బొయ్యికింద మంట రాజేసి, కాగులో వేడినీళ్ళు కాచే ప్రయత్నంలో వున్నాడు. మంచం నుంచి విప్పిన నవ్వారు వుడక బెడదామని

వెంకట్రామయ్య పెద్దకూతురు అడిగింది.

"ఎలా జరిగింది నాన్నా తిరుపతిలో దర్శనం?"

"నా పిండాకూడులా, నువ్వెప్పుడూ వెళ్ళకు. అరనిముషం ఆ విగ్రహాన్ని చూడటానికి పధహారు గంటలా క్యూలో? ఛ. ఛ."

తెల్లబోతూ చూస్తున్న కూతురిని అడిగాడు ఆయన.

"ఎప్పుడొచ్చావ్? ఆఫీస్ కెళ్ళాడా అల్లుడు? ఒంట్లో నలతగా వుండటగా నీకు?"

"పది నిమిషాలవుతోంది. ఆయన మరో వారందాకా ఆఫీస్‌కి వెళ్ళక్కరలేదుట."

"ఏం శెలవా?"

"సస్పెండ్ చేశారుట"

"దేనికి?" అడిగాడు ఉలిక్కిపడి.

"ఏదో పొరపాటు చేశారుట ఆఫీసులో."

"ఏం పొరపాటు?"

"స్టోర్సులో కదా ఆయన పని చేసేది?"

"అవును."

"తిరుపతి డిపోకి కొత్తటైర్లు పంపాల్సిన బాధ్యత ఈయనదేట."

"అయితే!"

"పంపడంలో బాగా జాప్యం చేశారుట. అక్కడనుంచి పదోతారీకు రాత్రి బయలుదేరి హైద్రాబాద్ వచ్చే బస్సు టైరులేక గంటన్నర ఆలస్యం అయిందిట. మరో బండిది తీసి వేశారుట కొత్తవి లేక. ఆ బస్‌లో ప్రయాణీకుల్లో ఎవరో వెధవ వూరుకోకుండా ఫిర్యాదుచేశాడుట ఆలస్యం అయిందని. అదంతా ఎంక్వయిరీకి వచ్చి, తప్పు ఈయదని తేలిందిట. పనిష్మెంట్‌గా వారంరోజులు ఇంట్లో కూర్చోమన్నారుట జీతం లేకుండా."

"అలాగా!"

## యాదృచ్ఛికం

గంగరాజు కారోజు ఎదురయిన సమస్య కొత్తదేంకాదు. బాగా పాతదే. గంగరాజు ఆఫీసర్ ఆ ఆఫీసుకు బదిలీ అయి వచ్చినంత పాతదా సమస్య, ప్రతీసారి ఆ సమస్యకి ఏదో ఓ పరిష్కారం దొరుకుతూనే వుంది గంగరాజుకి.

అంత పెద్ద సమస్య కాకపోయినా, ఒకోసారి అది కొండంత సమస్యగా అనిపిస్తుంటుంది గంగరాజుకి.

అడగినప్పుడు అడిగినంత శెలవు మంజూరు చెయ్యడు గంగరాజు ఆఫీసరు. తను ఆఫీసర్‌గా గుర్తింపబడాలంటే, శెలవు మంజూరు చేయకుండా తను ఆఫీసరనే నిజాన్ని గుర్తు చేయాలనుకునే స్వభావం ఆయనది బహుశ.

దగ్గిరే ఉన్న అజంతా, ఎల్లోరాలని, నాలుగయిదురోజులు బొంబాయినీ చూడాలని సంసిద్ధమయ్యాడు గంగరాజు. కేవలం ఆరురోజులే